APTEL /25/A2860

E వార్త NEWS

సీమ వార్త
తెలుగు దినపత్రిక

ఏలేకరులు కావలెను

సీమ వార్త తెలుగు దినపత్రిక ఏపీ రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల వారీగా బ్యూరో ఇన్చార్జులు స్టాఫ్ రిపోర్టర్లు ఆర్సి ఇన్చార్జిలు వెంటనే కావలెను అర్హత కనీసం డిగ్రీ అనుభవం ఉన్నవారికి ప్రాధాన్యత
వివరాలకు సంప్రదించండి
చీఫ్ ఎడిటర్ బీరె ఈశ్వరయ్య
9490860881


అనంతపురం | సంపుటి : 1 | సంచిక : 185 | పేజీలు : 4 | శనివారం 11 ఏప్రిల్ 2026 | ఎడిటర్ : బీరే ఈశ్వరయ్య | వెల : 2/-

## క్రిమినల్‌తో రాజకీయాలు చేసేటప్పుడు చాలా జాగ్రత్తగా ఉండాలి

- మంత్రులకు సీఎం దిశానిర్దేశం
- కరుడుగట్టిన నేరస్థుడితో రాజకీయాలు ప్రమాదకరం
- ఉన్నది లేనట్టు, లేనిది ఉన్నట్టు ప్రచారం చేసే కుట్రలను నిత్యం తిప్పికొట్టాలి
- కేబినెట్ అజెండా అంశాలు ముగిశాక వివిధ అంశాలపై మంత్రులతో చర్చించిన సీఎం చంద్రబాబు
- బెదిరింపు రాజకీయాలను ధీటుగా తిప్పికొట్టాలి

**అమరావతి**

కరుడుగట్టిన నేరస్థుడితో రాజకీయాలు ప్రమాదకరమని సీఎం చంద్రబాబు అన్నారు. నేరగాళ్లతో రాజకీయాలు చేసేటప్పుడు చాలా జాగ్రత్తగా ఉండాలని మంత్రులకు దిశా నిర్దేశం చేశారు. మంత్రివర్గ సమావేశంలో అజెండా అంశాలు ముగిశాక ఇతర అంశాలపై మంత్రులతో ముఖ్యమంత్రి చర్చించారు. రాష్ట్ర మంత్రి వర్గ సమావేశం దాదాపు 3గంటలపాటు సుదీర్ఘంగా సాగింది. కేబినెట్ అజెండా అంశాలు ముగిశాక మంత్రులతో ముఖ్యమంత్రి చంద్రబాబు పలు అంశాలపై చర్చించారు. జలధార, సూర్యఘర్, పీఎం కుసుమ్, పట్టాదారు పాస్ - మిగతా3లో






## రాజ్యసభ సభ్యునిగా ప్రమాణ స్వీకారం చేసిన నీతీశ్ కుమార్

- నీతీశ్ చేత ప్రమాణస్వీకారం చేపించిన రాజ్యసభ ఛైర్మన్ సీపీ రాధాకృష్ణన్
- హిందీలో ప్రమాణం చేసిన నీతీశ్ కుమార్
- కార్యక్రమానికి హాజరైన కేంద్రమంత్రులు జేపీ నడ్డా, నిర్మలా సీతారామన్

## ఇంధన భద్రతపై గల్ఫ్ దేశాలతో చర్చలు

- పశ్చిమాసియాలోని పరిణామాలను నిశితంగా పరిశీలిస్తున్నాం
- దేశ ఇంధన భద్రతను బలోపేతం చేసేందుకు కేంద్ర మంత్రులు గల్ఫ్ దేశాల్లో పర్యటిస్తున్నారు
- భారత విదేశాంగ అధికార ప్రతినిధి రణ్‌ధీర్ జయస్వాల్

## డ్రగ్స్ రహిత ఏపీ లక్ష్యంగా
# దండి యాత్ర 2.0



- తిరుపతి నుంచి విశాఖకు 1000 కి.మీల భారీ సైకిల్ ర్యాలీ
- యువతను పట్టిపీడిస్తున్న డ్రగ్స్ మహమ్మారిని తరిమికొట్టేందుకు మహా సంకల్పం
- తిరుపతి నుంచి విశాఖపట్నం దాకా వెయ్యి కిలోమీటర్ల ప్రయాణం
- లక్ష మంది విద్యార్థులతో సే నో టు డ్రగ్స్ ప్రతిజ్ఞ

**అమరావతి**

సమాజాన్ని పట్టి పీడిస్తున్న అతిపెద్ద సమస్య డ్రగ్స్ (మాదకద్రవ్యాలు). యువత ఉజ్వల భవిష్యత్తును బుగ్గిపాలు చేస్తున్న ఈ మత్తు మహమ్మారిని రాష్ట్రం నుంచి తరిమికొట్టేందుకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, పోలీస్ శాఖ సంయుక్తంగా నడుం బిగించాయి. మత్తు రహిత రాష్ట్రమే (డ్రగ్ ఫ్రీ ఏపీ) లక్ష్యంగా ఒక మహా యజ్ఞానికి శ్రీకారం చుట్టాయి. ఉప్పుపై పన్నును నిరసిస్తూ నాడు జాతిపిత మహాత్మా గాంధీ చేపట్టిన చారిత్రక - మిగతా3లో

## గృహ గణనలో ఇప్పటికే 5.72 లక్షల కుటుంబాల సెల్ఫ్ ఎన్యుమరేషన్




- స్మార్ట్‌గా, సౌకర్యవంతంగా లక్షలాది కుటుంబాల స్వీయ గణన
- జనగణన డిజిటల్ సదుపాయాల్లో పెరుగుతున్న ప్రజా భాగస్వామం
- 5.72 లక్షల కుటుంబాల సెల్ఫ్ ఎన్యుమరేషన్ : ఆర్‌జీఐ
- ప్రత్యేక మొబైల్ యాప్ - ప్రతీ కుటుంబానికి 33 ప్రశ్నలు
- తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో సెల్ఫ్ ఎన్యుమరేషన్ వేర్వేరు తేదీల్లో జరగనుంది
- ఆంధ్రప్రదేశ్‌లో సెల్ఫ్ ఎన్యుమరేషన్ కాలపరిమితి ఏప్రిల్ 16 నుంచి ఏప్రిల్ 30 వరకు ఉంటుంది.



## ఎన్నికల వేళ మోదీ గిమ్మిక్కులు

- నియోజకవర్గాల పునర్విభజనతో పెను ముప్పు: ఖర్గే
- మహిళా రిజర్వేషన్ల అమలులో కుట్ర
- నియోజక వర్గాల పునర్విభజనపై విపక్షాల ఉమ్మడి పోరుకు ఖర్గే పిలుపు

## వచ్చే 6 నెలల్లో..
# 10 లక్షల ఎల్పీజీ కనెక్షన్లు ఇవ్వాలి

- అధికారులకు సీఎం చంద్రబాబు ఆదేశం
- ఎల్పీజీ గ్యాస్ సరఫరా సమస్యను ఎదుర్కొనేందుకు మరింత సన్నద్ధతతో పనిచేయాలని ఆదేశం
- పైప్డ్ నేచురల్ గ్యాస్ వినియోగం పెంచేందుకు చర్యలు తీసుకోవాలని సూచన
- రాష్ట్రంలో గ్యాస్ సరఫరాపై ముఖ్యమంత్రి చంద్రబాబు సమీక్ష



**అమరావతి**

యుద్ధాల కారణంగా తలెత్తిన ఎల్పీజీ గ్యాస్ సరఫరా సమస్యను ఎదుర్కొనేందుకు మరింత సన్నద్ధతతో పనిచేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశించారు. పైప్డ్ నేచురల్ గ్యాస్ వినియోగం పెంచేందుకు చర్యలు తీసుకోవాలని అధికారులకు, ఆయిల్ కంపెనీలకు సూచించారు. దీపం పథకం లబ్దిదారులకు పీఎన్జీ వినియోగంపై అవగాహన కల్పించాలన్నారు. దీపం పథకం లబ్దిదారులు పీఎన్జీకి మారితే, వారికి దీపం పథకం కింద ఇచ్చే రాయితీ సొమ్మును జమ చేసేందుకు ఇప్పటికే నిర్ణయం తీసుకున్నామని, దీనిపై వెంటనే ఉత్తర్వులు విడుదల చేయాలని ఆదేశించారు. - మిగతా3లో

## పెద్ద కుటుంబాలకు ప్రోత్సాహం

- త్వరలో ఫ్యామిలీ బెనిఫిట్ మేనేజ్‌మెంట్ సిస్టమ్ బిల్లు
- ఏపీలో పెద్ద కుటుంబాలకు ప్రాధాన్యం
- సంస్కరణల అమలుకు నిర్ణయించిన ప్రభుత్వం
- ఐటీ, విద్యాశాఖ మంత్రి అధ్యక్షతన మంత్రివర్గ ఉపసంఘం ఏర్పాటు

**అమరావతి**

కుటుంబాన్ని ఒక యూనిట్‌గా తీసుకుని ప్రభుత్వ ప్రయోజనాలను అందించడంతో పాటు పెద్ద కుటుంబాలను ప్రోత్సహించడం ప్రధాన లక్ష్యంగా సంస్కరణలను అమలు చేయాలని కూటమి ప్రభుత్వం నిర్ణయించింది. ఇందుకు సంబంధించి త్వరలో - మిగతా3లో







## పాకిస్థాన్ గూఢచార మాడ్యూల్ గుట్టురట్టు చేసిన ఢిల్లీ పోలీసులు

- 'సీసీటీవీ'లతో సైనికుల కదలికలపై నిఘా పెట్టిన ఉగ్రముఠా
- పాకిస్థాన్ హ్యాండర్లతో ఉగ్రముఠాకు సంబంధాలు
- 11 మంది అరెస్టు- సాంకేతికతను ఉపయోగించి సైనిక కదలికలపై నిఘా

## మహిళలకు, నిరుద్యోగులకు రూ.3000 ఆర్థిక సాయం

- చొరబాట్లపై ఉక్కుపాదం
- బంగాల్ బీజేపీ మేనిఫెస్టో ఇదే!
- సోనార్ బంగ్లా రోడ్ మ్యాప్
- బంగాల్ ఎన్నికల కోసం 15 అంశాలతో బీజేపీ మేనిఫెస్టో విడుదల



## 108 లో ఆడబిడ్డకు జన్మనిచ్చిన తల్లి.

**గోరంట్ల ఏప్రిల్ 10 సీమ వార్త.**



గోరంట్ల ప్రభుత్వ ఆసుపత్రి నుంచి ప్రసవం నిమిత్తం పుట్టపర్తి మండలం గంగిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన అనూష అనే మహిళను 108 లో హిందూపురం వెళుతూ మార్గమధ్యంలో హిందూపురం సమీపంలోని బిట్ కాలేజీ వద్ద మార్గమధ్యంలో ప్రసవం జరిగి అనూష ఆడబిడ్డకు జన్మనిచ్చినట్లు 108 సిబ్బంది తెలిపారు. అయితే తల్లి బిడ్డ ఆరోగ్యంగా ఉన్నట్లు ఈఎంఐ శ్రీనివాసులు, పైలెట్ నరసింహులు తెలిపారు.

## మార్కెట్ యార్డ్ లో అత్యవసర సమావేశం ఏర్పాటు చైర్మన్ బిఎస్ గురుమూర్తి




**మడకశిర ఏప్రిల్ 10 సీమ వార్త:** పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ యార్డ్ చైర్మన్ బిఎస్ గురుమూర్తి ఆధ్వర్యంలో, మార్కెట్ యార్డ్ సెక్రెటరీ అధ్యక్ష తన, మార్కెట్ యార్డ్ సభ్యులు మార్కెట్ యార్డ్ కార్యాలయ సిబ్బంది సమక్షంలో శుక్రవారం మార్కెట్ యార్డ్ డైరెక్టర్లు కంచు యాదవ్, శివరాములు, ఆర్ మార్కెట్ యార్డ్ డైరెక్టర్, ఆధ్వర్యంలో అత్యవసర సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మార్కెట్ యార్డ్ డైరెక్టర్లు బదిరి, రామకృష్ణ డైరెక్టర్లు పాల్గొని సమస్యలపై చర్చించారు.

## ఇకపై ఎరువుల కొనుగోలుకు ఆధార్ తప్పనిసరి: వ్యవసాయ శాఖ జెడి సోమసుందర్



**బళ్లారి, ఏప్రిల్ 10సీమవార్త:**

ఈ వర్షాకాలంలో ఎరువుల విక్రయాలను అక్రమ మార్గాల్లో (బ్లాక్ మార్కెట్‌లో) జరగకుండా కట్టడి చేసేందుకు, వాటి పంపిణీని ఒక క్రమపద్ధతిలో నిర్వహించేందుకు వ్యవసాయ శాఖ కఠిన చర్యలు చేపడుతోంది.
ఈ క్రమంలో, నగరంలోని దీణూరా హాల్‌లో నిన్న సాయంత్రం వ్యవసాయ పరికరాల డీలర్ల సంఘంతో వ్యవసాయ శాఖ ఒక సమావేశాన్ని నిర్వహించింది.
ఈ సమావేశంలో మాట్లాడుతూ, వ్యవసాయ శాఖ జె.డి.సోమసుందర్ కె.ఎం. జిల్లాలోని రైతులు యూరియా ఎరువులను కొనుగోలు చేసేటప్పుడు తమ ఆధార్ కార్డు లేదా రైతు గుర్తింపు సంఖ్యను తప్పనిసరిగా సమర్పించాలని తెలిపారు.
2026-27 ఆర్థిక సంవత్సరం నుండి ఎరువుల విక్రయ ప్రక్రియను పర్యవేక్షించేందుకు శాఖ ఒక ప్రత్యేక యాప్‌ను రూపొందించింది. ఇకపై చిల్లర ఎరువుల విక్రేతలు రైతుల ఆధార్ లేదా ఎఫ్ ఐ డి సంఖ్యను ఈ యాప్ ద్వారా నమోదు చేసిన తర్వాతే ఎరువులను పంపిణీ చేయాల్సి ఉంటుంది. దీనివల్ల ఎరువుల దుర్వినియోగాన్ని అరికట్టవచ్చని ఆయన పేర్కొన్నారు. ఈ సమావేశంలో వ్యవసాయ శాఖకు చెందిన ఎస్.ఎన్. మంజునాథ్, విజిలెన్స్ శాఖ సంయుక్త సంచాలకుడు ఎస్. శివకుమార్, మృత్యుంజయ,
వ్యవసాయ పరికరాల డీలర్ల సంఘం జిల్లా అధ్యక్షుడు హెచ్. తిమ్మనగౌడ, సిద్ధమ్మనహళ్లి, హగరి కృషి విజ్ఞాన కేంద్రం అధిపతి పాలయ్య, శాస్త్రవేత్త మంజునాథ్, పంపిణీదారుల సంఘం కార్యదర్శి శ్రీనివాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## మంచి ఆలోచనలతోనే బాలికలకు మంచి భవిష్యత్తు వైద్యులు దీప్తి.......



**నంబులపూలకుంట: ఏప్రిల్ 10 (సీమవార్త):** చెడు ఆలోచనలు దూరం చేసిమంచి ఆలోచనలతో చదువులోమంచిగా రాణిస్తూ తల్లిదండ్రులకు మంచి పేరు ఉండేలా బాలికలు అందరూ ముందుకు నడవాలని వైద్యురాలు దీప్తి పేర్కొన్నారు.ఈ సందర్భంగా వైద్యురాలు దీప్తి నంబులపూలకుంట మండల కేంద్రంలోని ఉన్న కస్తూరిబా పాఠశాలలో ప్రిన్సిపాల్ రిహానా ఆధ్వర్యంలో బాలికలకు ఆరోగ్య సూత్రాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. వైద్యురాలు బాలికలు పాటించవలసిన శుభ్రతలపై ఆరా తీసి పలు సూచనలు చేశారు. దీంతోపాటు బాలికలందరూ ఆరోగ్య సూత్రాలు పాటించినట్లయితే సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటారని వివరించారు. గ్రామాలలో బాల్యవివాహాలు దూరం చేసేలా తల్లిదండ్రులకు బాలికలు తెలియజేయాలని తెలిపారు. బాల్య వివాహాల వల్ల జరిగే అనర్థాల గూర్చి పూర్తి స్థాయిలో తెలియజేస్తే బాల్యవివాహాలను అరికట్టవచ్చునని వివరించారు. ప్రస్తుతం క్యాన్సర్ బారిన పడకుండా ఉండేలా ముందస్తుగా వ్యాక్షన్ను గూర్చి అవగాహన కల్పించారు అలానే కస్తూరిబా పాఠశాలలో మౌలిక వసతులను వైద్యురాలు సిహెచ్ఓ నాగలక్ష్మి పరిశీలించి శుభ్రతలు చక్కగా ఉండడంతో సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో పీహెచ్ఎన్ రామ తులసి, సూపర్వైజర్ రాధమ్మ, ఆరోగ్య కార్యకర్తలు రమేష్ రెడ్డి, విజయ భాస్కర్, శంకరమ్మ పాల్గొన్నారు.

## స్టాఫ్ సెలక్షన్ కమిషన్ పరీక్షల్లో మెరిసిన బుటారి ప్రీతి
## జీఎస్టీ తనిఖీ అధికారిగా ఎంపికై పట్టుదలకు నిదర్శనం

**కళ్యాణదుర్గం, ఏప్రిల్ 10 సీమవార్త:**

కేంద్ర ప్రభుత్వ విభాగాల్లో ఖాళీగా ఉన్న ఉద్యోగాల భర్తీ కోసం 2025లో నిర్వహించిన స్టాఫ్ సెలక్షన్ కమిషన్ సమగ్ర పట్టభద్ర స్థాయి పోటీ పరీక్షల్లో కళ్యాణదుర్గం మండలం ముద్దినా యనపల్లి గ్రామానికి చెందిన బుటారి ప్రీతి ప్రతిభ కనబరిచి, కేంద్ర రెవెన్యూ శాఖలో వస్తు సేవల పన్ను (జీఎస్టీ) తనిఖీ అధికారిగా ఎంపికై అందరికీ ఆదర్శంగా నిలిచింది. ఈ పరీక్షలకు దేశవ్యాప్తంగా సుమారు 13.5 లక్షల మంది అభ్యర్థులు పోటీపడగా, ప్రీతి మొదటి ప్రయత్నంలోనే 2,150వ ర్యాంకు సాధించడం విశేషం. ఇంటి వద్దనే ఒక సంవత్సరం పాటు క్రమశిక్షణతో, పట్టుదలతో సాధన చేసి ఈ విజయాన్ని అందుకుంది. ఇష్టపడి కష్టపడి చదివితే మంచి ఫలితాలు సాధ్యమేనని ఆమె నిరూపించింది. ప్రీతి తండ్రి బుటారి వెంకటేశులు ఉపాధ్యాయులు కాగా, తల్లి శిరీష గృహిణి. తండ్రి ప్రోత్సాహం, కుటుంబ సభ్యుల సహకారం తన విజయానికి ప్రధాన కారణమని ప్రీతి తెలిపింది.





విద్యార్హతల పరంగా ప్రీతి ఇంటర్‌లో బయాలజీ గ్రూప్‌లో చదివి, అనంతరం కడప ప్రభుత్వ దంత వైద్య కళాశాలలో దంత శస్త్ర వైద్య పట్టా (బీడీఎస్) పూర్తి చేసింది. ప్రభుత్వ ఉద్యోగం సాధించాలని లక్ష్యంగా పెట్టుకుని పోటీ పరీక్షలకు సిద్ధమైంది. ఇదే కుటుంబంలో ఆమె తమ్ముడు బుటారి తరుణ్ సాయి కూడా 2022లో వైద్య ప్రవేశ పరీక్షలో మంచి ర్యాంకు సాధించి ఉచిత సీటుతో ఎంబీబీఎస్‌లో ప్రవేశం పొందాడు. తమ్ముడి విజయాన్ని స్ఫూర్తిగా తీసుకున్న ప్రీతి, ఇంటి వద్దే సిద్ధమై ఈ స్థాయికి చేరడం ప్రత్యేకంగా నిలిచింది. కృషి, సంకల్పం, పట్టుదల ఉంటే సాధించలేనిది ఏదీ లేదని ప్రీతి విజయగాథ స్పష్టం చేస్తోంది. ఆమె సాధించిన విజయంపై కుటుంబ సభ్యులు, బంధువులు, మిత్రులు ఆనందం వ్యక్తం చేస్తూ అభినందనలు తెలియజేశారు.

## జిల్లా కమిటీ సమావేశంలో డి హెచ్ ఓ డాక్టర్ యల్లా రమేష్ బాబు ప్రకటన

**- గర్భస్థ శిశువు లింగ నిర్ధారణ శిక్షార్హమైన నేరం; నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు**

**బళ్లారి ఏప్రిల్10సీమవార్త:**

గర్భస్థ శిశువు లింగ నిర్ధారణ చేయడం శిక్షార్హమైన నేరమని, నిబంధనలు ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ యల్లా రమేష్ బాబు తెలిపారు. బుధవారం నగరంలోని జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖ కార్యాలయ సమావేశ మందిరంలో జరిగిన పిసి, పి ఎన్ డి టి చట్టానికి సంబంధించిన జిల్లా సలహా కమిటీ మరియు జిల్లా పర్యవేక్షణ కమిటీ సమావేశానికి అధ్యక్షత వహిస్తూ ఆయన ఈ విధంగా మాట్లాడారు. బాలికల రక్షణ మనందరి బాధ్యత అని ఆయన పేర్కొన్నారు. గర్భస్థ శిశువు లింగ నిర్ధారణ చేయడం లేదా అటువంటి చర్యలను ప్రోత్సహించడం చట్టవిరుద్ధమని ఆయన స్పష్టం చేశారు.

**స్కానింగ్ కేంద్రాలకు కఠిన ఆదేశాలు:**

జిల్లాలోని అన్ని స్కానింగ్ కేంద్రాలు ప్రభుత్వ మార్గదర్శకాలను తప్పక పాటించాలి. అవి తమ లైసెన్సులను ఎప్పటికప్పుడు పునరుద్ధరించుకోవాలి. అన్ని కేంద్రాలు ప్రతి నెలా 5వ తేదీలోపు "ఫ్" ఫారాలను జిల్లా కార్యాలయానికి తప్పనిసరిగా సమర్పించాలి. కొత్తగా నమోదు చేసుకునే దరఖాస్తుదారులు నిర్ణీత సమయానికి దరఖాస్తు చేసుకోవాలని ఆయన సూచించారు.



**చట్ట ఉల్లంఘనకు భారీ జరిమానాలు మరియు జైలు శిక్ష:**

లింగ నిర్ధారణకు సంబంధించి ప్రకటనలు చేస్తే 3 సంవత్సరాల జైలు శిక్ష మరియు రూ. 10,000 జరిమానా విధించబడుతుంది. వైద్యులు లింగ నిర్ధారణ చేస్తే (మొదటిసారి) 3 సంవత్సరాల జైలు శిక్ష మరియు రూ. 10,000 జరిమానా ఉంటుంది. వైద్యులు రెండవసారి లింగ నిర్ధారణ చేస్తే 5 సంవత్సరాల జైలు శిక్ష మరియు రూ. 50,000 జరిమానా విధించబడుతుంది. లింగ నిర్ధారణ కోసం కుటుంబ సభ్యులు ఒత్తిడి తెచ్చినట్లయితే (మొదటిసారి) 3 సంవత్సరాల జైలు శిక్ష మరియు రూ. 50,000 జరిమానా, రెండవసారి అయితే 5 సంవత్సరాల జైలు శిక్ష మరియు రూ. 1 లక్ష జరిమానా విధించబడుతుంది.
కాబట్టి, 'గర్భస్థ శిశువు లింగ నిర్ధారణ నిషేధ చట్టం-1994' కింద విధించే శిక్షలు అత్యంత కఠినంగా ఉంటాయని, ఈ విషయమై ప్రజల్లో మరియు వైద్య వర్గాల్లో అవగాహన కల్పించాలని అధికారులను ఆయన ఆదేశించారు.
ఈ సమావేశంలో జిల్లాలోని స్కానింగ్ కేంద్రాల పనితీరు మరియు ఆడ శిశువుల హత్యల నివారణ తదితర అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా, పిసి, పిఎన్డిటి చట్టం యొక్క జిల్లా సలహా కమిటీ మరియు జిల్లా పర్యవేక్షణ కమిటీ ఛైర్మన్ డాక్టర్ శంభుతో పాటు, సభ్యులు --- జిల్లా అమలు అధికారి డాక్టర్ వీరేంద్ర కుమార్, ప్రైవేట్ రేడియాలజిస్ట్ డాక్టర్ రాఘవేంద్ర, జిల్లా ఆసుపత్రి శిశువైద్యురాలు డాక్టర్ భావన, కురుగ్నోడు రేడియాలజిస్ట్ డాక్టర్ రవిచంద్ర వర్మ, పి సి, పి ఎన్ డి టి విషయ నిర్వాహకులు గోపాల్, తిప్పేస్వామి మరియు ఇతర ప్రముఖులు పాల్గొన్నారు.

## భూగర్భ జలాలను పెంచడానికి జల దార జల హారతి

**- ఇరిగేషన్ ఏఈ భార్గవ్**

**అమరాపురం ఏప్రిల్ 10సీమవార్త**

మండల పరిధిలోని హలుకూరు, మద్దనకుంట, అమరాపురం గ్రామపంచాయతీలలో శుక్రవారం వారం జలధార, జల హారతి కార్యక్రమంపై ఇరిగేషన్ ఏఈ భార్గవ్ ఆధ్వర్యంలో గ్రామసభలనునిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాలలో భూగర్భ జలాలను పెంపొందించడానికి ప్రభుత్వం జల ధార జల హారతి కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా చేపట్టినట్లు ఆయన పేర్కొన్నారు. ముఖ్యంగా అడుగంటిన భూగర్భ జలాలను పెంపొందించడానికి ఫారం ఫండ్ నీటి కుంటలు తదితర కార్యక్రమాల ద్వారా నిధులను మంజూరు చేసి ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. ప్రతి గ్రామ పంచాయతీలలో కూడా పనుల గుర్తించి ప్రతిపాదనలను తయారు చేయడానికి స్థానిక చెరువు నీటి సంఘం మరియు రైతుల ద్వారా వివరాలను సేకరిస్తున్నట్లు ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. ముఖ్యంగా నీటిని ఒడిసి పట్టి నీటి గుంతలను ఏర్పాటు చేస్తే భూగర్భ జలం పెరిగి తాగునీటికి సాగునీటికి అనుకూలంగా ఉంటుందని తెలియజేశారు. ఈ సందర్భంగా ఏపీవో శివన్న మాట్లాడుతూ ఉపాధి హామీకి అనుసంధానం చేసి రాబోవు వంద రోజుల్లో, ఏ ఏ పనులు అయితే గుర్తించి మంజూరుకు జిల్లా ఉన్నతాధికారులకు పంపితే తక్షణమే మంజూరు చేయడం జరుగుతుందని తర్వాత 80 రోజుల్లో పనులు పూర్తి చేసి భూగర్భ జలం పెంపునకు కృషి చేయాలని ఆయన కోరారు. వర్షపు ప్రతి నీటి బొట్టు భూగర్భజలం పెరగడానికి కృషి చేయాలని గ్రామస్తులకు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో టెక్నికల్ అసిస్టెంట్ ఈరన్న ,హలుకూరు పంచాయతీ కార్యదర్శి గౌరమ్మ, అమరాపురం పంచాయతీ కార్యదర్శి యోగానంద మద్దనకుంట పంచాయతీ కార్యదర్శి ఈరన్న, ఫీల్డ్ అసిస్టెంట్లు ఓంకార్ ,రంగారెడ్డి, రవికుమార్ చెరువు సంఘం అధ్యక్షులు శివరామప్ప, చెరువు సంఘం ఉపాధ్యక్షులు మరియు స్థానిక నాయకులు మండల ప్రధాన కార్యదర్శి నాగరాజు, టిడిపి పార్లమెంట్ తెలుగు యువత ఉపాధ్యక్షుడు రఘు, హలుకూరు పంచాయతీ టీడీపీ కన్వీనర్ ఆనంద్, మాజీ డీలర్ శ్రీనివాస్, జయరామప్ప, యువ నాయకుడు వివేక్ డీలర్ హిమంత రాజు, మండల తెలుగు యువత అధ్యక్షుడు హలుకూరు నాగరాజు, రఘు,సిబ్బంది స్థానిక రైతులు గ్రామసభలో పాల్గొన్నారు.



## బళ్లారి సెంట్రల్ జైలుపై 200 మంది పోలీసులచే సోదాలు

**బళ్లారి, ఏప్రిల్10 సీమవార్త:** గురువారం సాయంత్రం 7 గంటల సమయంలో నగరంలోని సెంట్రల్ జైలుపై పోలీసులు దాడి చేశారు. ఒకే సమయంలో 200 మందికి పైగా పోలీసు సిబ్బంది జైలులో ఉండటంతో, ఖైదీలలో భయానక వాతావరణం నెలకొంది. బళ్లారి ఎస్పీ సుమన్ డి. పన్నేకర్, అదనపు ఎస్పీ నవీన్ కుమార్ నేతృత్వంలో జరిగిన ఈ ఆపరేషన్ సుమారు 3 నుంచి 4 గంటల పాటు కొనసాగింది. ప్రతి బ్యారక్, టాయిలెట్, ఖైదీలు తిరిగే ప్రాంతంలో పోలీసులు మోహరించడంతో జైలు మొత్తం పోలీసుల నియంత్రణలోకి వచ్చింది.
పోలీసులు క్షుణ్ణంగా సోదాలు నిర్వహించారు. వందలాది అనుమానాస్పద వస్తువుల స్వాధీనం: సోదాల్లో పెద్ద మొత్తంలో ప్రాణాంతక ఆయుధాలు లేదా మాదకద్రవ్యాలు లభించలేదు. అయితే, అధికారులకు దొరికిన రెండు అనుమానాస్పద వస్తువులను స్వాధీనం చేసుకున్నారు. వీటిని సంబంధిత శాఖ సాక్ష్యాలుగా నమోదు చేసింది మరియు తదుపరి దర్యాప్తు కొనసాగుతోంది. విశ్వసనీయ వర్గాల సమాచారం ప్రకారం, నిన్న జైలులో కొంతమంది ఖైదీలు దురుసుగా ప్రవర్తించడం, అదుపుతప్పడం వంటి ఘటనలు జరిగాయి. జైలు భద్రతను మరింత కట్టుదిట్టం చేయడం, ఖైదీలను హెచ్చరించడం అనే లక్ష్యంతో ఈ ఆపరేషన్‌ను ప్లాన్ చేసినట్లు తెలిసింది. ఇది ఒక సాధారణ తనిఖీ అని ఎస్పీ తెలిపారు: దాడుల అనంతరం మీడియాతో మాట్లాడుతూ, ఎస్పీ సుమన్ డి. పన్నేకర్ "ఇది ఏ ప్రత్యేక ఉద్దేశ్యంతో చేసిన దాడి కాదు. భద్రతా కారణాల దృష్ట్యా జైళ్లలో ఎప్పటికప్పుడు నిర్వహించే ఒక సాధారణ తనిఖీ మాత్రమే ఇది" అని చెప్పారు. పో లీసుల ఈ సోదాల వల్ల కొంతకాలం పాటు ఖైదీలలో భయాందోళనలు నెలకొన్నాయి.



# డ్రగ్స్ రహిత ఏపీ లక్ష్యంగా 'దండి యాత్ర 2.0'

-మొదటిపేజీ తరువాయి

'దండియాత్ర' మనందరికీ తెలుసు. ఇప్పుడు సరిగ్గా అదే స్ఫూర్తితో డ్రగ్స్ వలయాలను ఛేదించేందుకు 'దండి యాత్ర 2.0' పేరుతో తిరుపతిలో భారీ సైకిల్ ర్యాలీ మొదలైంది. బ్రిటీష్ కాలంలో ఉప్పు చట్టాలను వ్యతిరేకిస్తూ గాంధీజీ శబర్మతి ఆశ్రమం నుంచి దండి వరకు సుమారు 390 కిలోమీటర్ల మేర చారిత్రక పాదయాత్ర చేశారు. నాడు పరాయి పాలన నుంచి విముక్తి కలిగించేందుకు ఆ యాత్ర సాగితే, నేడు మత్తు నుంచి యువతను విముక్తి చేసేందుకు 'దండి యాత్ర 2.0' ప్రారంభమైంది. ఆంధ్రప్రదేశ్ పోలీసులకు చెందిన ప్రత్యేక విభాగం 'ఈగల్ టీమ్', స్వచ్ఛంద సంస్థ 'వైబ్రెంట్స్ ఆఫ్ కలాం' సంయుక్త ఆధ్వర్యంలో ఈ యాత్రను డిజైన్ చేశారు. ఈ భారీ సైకిల్ యాత్ర తిరుపతిలోని శ్రీ వెంకటేశ్వర యూనివర్సిటీ నుంచి ఉత్సాహంగా ప్రారంభమైంది. ఇక్కడి నుంచి విశాఖపట్నం వరకు ఈ యాత్ర కొనసాగుతుంది. మొత్తం 1000 కిలోమీటర్ల మేర ఈ సుదీర్ఘ ప్రయాణం సాగనుంది. సైకిల్ యాత్ర బృందం ప్రతిరోజూ 60 కిలోమీటర్ల మేర ప్రయాణిస్తుంది. "డ్రగ్స్ నిర్మూలనే లక్ష్యంగా దాదాపు 1000 కిలోమీటర్ల వరకు మేము యాత్ర చేస్తున్నాం. మా వైబ్రెంట్స్ ఆఫ్ కలాం సంస్థకు చెందిన ఏడుగురు సభ్యుల బృందం ఈ సైకిల్ యాత్రలో పాల్గొంటోంది. 13 జిల్లాల మీదుగా 25 యూనివర్సిటీలు, కాలేజీలకు వెళ్తాం. దాదాపు లక్ష మంది యువతను ప్రత్యేకంగా కలుసుకుని, వారితో 'సే నో టు డ్రగ్స్' అనే ప్రతిజ్ఞ చేయిస్తూ యాత్రను ముందుకు నడిపిస్తాం. సీఎం చంద్రబాబుని కలిసి ఆయన మార్గదర్శకత్వంలో ఈ యాత్రకు శ్రీకారం చుట్టాం. దీనికి ఐజీ ఆర్కే రవికృష్ణ పూర్తి సహకారాలు అందిస్తున్నారు. ఈరోజు ఎస్వీ యూనివర్శిటీ నుంచి యాత్ర మొదలైంది." – విజయ్ కల్లాం, ఫౌండర్, వైబ్రెంట్స్ ఆఫ్ కలాం సంస్థ



### లక్ష మంది యువతే టార్గెట్

ఈ యాత్ర ప్రధాన ఉద్దేశం యువత ఆలోచనా విధానంలో మార్పు తీసుకురావడమే. యాత్ర మొత్తం మీద రాష్ట్రంలోని 13 జిల్లాల గుండా ఈ బృందం ప్రయాణిస్తుంది. ఆయా జిల్లాల్లో దారి పొడవునా ఉన్న సుమారు 25 విశ్వవిద్యాలయాలు (యూనివర్సిటీలు), ఇంజినీరింగ్, డిగ్రీ కళాశాలలను వీరు సందర్శిస్తారు. దాదాపు ఒక లక్ష మంది యువతను ప్రత్యక్షంగా కలుసుకుని, వారితో మమేకం అవుతారు. డ్రగ్స్ వినియోగం వల్ల శారీరకంగా, మానసికంగా, సామాజికంగా ఎదురయ్యే అనర్థాల గురించి వివరిస్తారు. డ్రగ్స్ ఉపయోగిస్తే జరిగే నష్టాలను వివరిస్తూ ప్రజలకు అవగాహన కల్పించడమే ఈ ర్యాలీ ఉద్దేశం. 'డ్రగ్స్ వద్దు – సైకిల్ ముద్దు' అనే నినాదంతో ఈ దండి యాత్ర 2.0 కొనసాగుతుంది. 13 జిల్లాల్లో ఈ యాత్రకు శ్రీకారం చుట్టారు. దీనివల్ల ప్రజలంతా మత్తు పదార్థాల అనర్థాల గురించి తెలుసుకుని, డ్రగ్స్‌కు వ్యతిరేకంగా తీవ్రంగా పోరాడాలని మేము తెలియజేస్తున్నాం." – తిరుపతి పోలీసులు

### ప్రభుత్వం, పోలీసుల మద్దతు

'డ్రగ్స్ వద్దు సైకిల్ ముద్దు' అనే పవర్‌ఫుల్ నినాదంతో ఈ యాత్ర ముందుకు సాగుతోంది. ఈ బృందానికి రాష్ట్ర ప్రభుత్వం, పోలీస్ శాఖ నుంచి సంపూర్ణ మద్దతు లభించింది. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు మార్గదర్శకత్వంలో ఈ యాత్ర రూపుదిద్దుకోగా, పోలీసు ఉన్నతాధికారి ఐజీ ఆర్కే రవికృష్ణ దీనికి పూర్తి సహకారాలు అందిస్తున్నారు.

# పెద్ద కుటుంబాలకు ప్రోత్సాహం

-మొదటిపేజీ తరువాయి

ఫ్యామిలీ బెనిఫిట్ మేనేజ్‌మెంట్ సిస్టమ్ (ఎఫ్‌బీఎంస్) బిల్లును అందుబాటులోకి తీసుకురానుంది. ఇందుకు సంబంధించి (ఫ్యామిలీ బెనిఫిట్ మేనేజ్‌మెంట్ సిస్టమ్) సిఫార్సు చేసేందుకు ఐటీ, విద్యాశాఖ మంత్రి ఛైర్మన్‌గా మంత్రివర్గ ఉపసంఘాన్ని ఏర్పాటు చేసింది. ఇందులో ఆర్థిక, హోం, రెవెన్యూ, పౌరసరఫరాలు, వైద్యఆరోగ్య, జలవనరుల శాఖల మంత్రులు సభ్యులుగా ఉంటారు. అదే విధంగా కన్వీనర్?గా ప్రణాళికాశాఖ ముఖ్యకార్యదర్శి విధులను నిర్వర్తిస్తారు.

### కమిటీ చేయవలసిన పనులివే!

ప్రధానంగా ప్రతిపాదిత ఫ్యామిలీ బెనిఫిట్ కార్డుకు వర్తింపజేసేలా 'కుటుంబం' అనే నిర్వచనాన్ని రూపొందించాలి. ఇది ముఖ్యంగా పెద్ద కుటుంబాలను ప్రోత్సహించే లక్ష్యానికి అత్యంత అనుకూలంగా ఉంటుంది. ప్రస్తుతం, అదే విధంగా భవిష్యత్తులో చూపేటటువంటి ఆర్థిక, పరిపాలనా ప్రభావాన్ని సైతం పరిగణనలోకి తీసుకోవాల్సిన అవసరం ఉంటుంది. ధనిక, పేద ఉండేటటువంటి ఆర్థిక అంతరాలను తగ్గించడమే లక్ష్యంగా వివిధ సంక్షేమ పథకాలకు సమగ్ర ఆర్థిక అర్హత ప్రమాణాల్ని పరిశీలించిన తర్వాత సిఫార్సు చేయాలి.

### పథకాల వారీగా ప్రయోజనాలు

చిన్న కుటుంబం (1–3 సభ్యులు) మధ్యస్థ కుటుంబం (4–6 మంది సభ్యులు), పెద్ద కుటుంబం (7–ఆపైన) దృష్టిలో పెట్టుకుని పథకాల వారీగా ప్రయోజనాలకు సంబంధించి సంస్కరణలను సిఫార్సు చేయడం, పెద్ద కుటుంబాలను ప్రోత్సహించే విధంగా, ప్రయోజనాల కోసం విడిపోయే కుటుంబాలను నిరుత్సాహపరిచే విధంగా ఉండాలి. ప్రజాధనాన్ని సమర్థంగా వినియోగించేలా ఉండటంతో పాటుగా సామాజిక భద్రతను అందించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యం. అందులో భాగంగానే వివిధ పథకాల ద్వారా పొందే మొత్తం ప్రయోజనాలపై గరిష్ట పరిమితి కోసం ఫ్రేమ్?వర్క్?ను సమీక్షించి సిఫార్సు చేయడం ముఖ్యమైన పాత్ర పోషిస్తుంది. అదే విధంగా ప్రతిపాదిత ఫ్యామిలీ బెనిఫిట్ మేనేజ్?మెంట్ బిల్లు, ఇతర నిబంధనలను సమీక్షించడం, కుటుంబ డేటా బేస్ నిర్వహణకు ప్రత్యేక అథారిటీ నియామకం, డేటాబేస్ అప్?డేట్ తయారీ, వినియోగం, ఏపీలో పథకాలు, అంతేకాకుండా సేవల పంపిణీకి ఫ్యామిలీ కార్డుల జారీ, వినియోగం మొదలైన తదితర అంశాలపై సిఫార్సు చేయాలి.

రాబోయే రోజుల్లో పెద్ద కుటుంబాలను ప్రోత్సహించేలా ఆలోచనలు చేస్తున్నామని గత నెలలో అమరావతిలో నిర్వహించిన మహిళా దినోత్సవ సందర్భంగా నిర్వహించిన సభలో సీఎం చంద్రబాబు పేర్కొన్నారు. కుటుంబ వ్యవస్థ అనేది మనకు భద్రత కల్పిస్తుందని, దాన్ని మరింత బలపరిచే బాధ్యత ప్రభుత్వానిపై ఉన్నదని సీఎం వివరించారు. ప్రస్తుతం జనాభా ఆందోళనకర స్థాయిలో తగ్గిపోతుందని చంద్రబాబు ఆవేదన వ్యక్తం చేశారు. దంపతులు ఇద్దరు లేదా ముగ్గురు పిల్లలను కనాలని సీఎం చంద్రబాబు పిలుపునిచ్చారు. మరికొందరైతే పిల్లల్ని కనే ఆలోచననే మానుకున్నారని, అయితే అది మంచి విధానం కాదని సీఎం చంద్రబాబు హితవు పలికారు.

# తిరుపతిలో 10 అంతస్తుల్లో బస్ స్టాండ్

**తిరుపతి :** తిరుపతికి శ్రీవారి దర్శనం కోసం నిత్యం భారీగా భక్తులు తరలివస్తుంటారు. ఈ మేకు భక్తులకు మెరుగైన వసతులు కల్పించేందుకు నగరంలో ప్రస్తుతం ఉన్న బస్టాండ్ స్థానంలో ఇంటర్ మోడల్ బస్ టెర్మినల్ ప్లాన్ చేసిన సంగతి తెలిసిందే. ఈ ప్రాజెక్టుకు రూ.470 కోట్లు ఖర్చవుతుందని అంచనా వేశారు. ఈ బస్ టెర్మినల్ నిర్మాణాన్ని ఈపీసీ విధానంలో నిర్మించాలని అధికారులు నివేదికను పంపారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తిరుపతిలో మౌలిక వసతుల్ని మరింత మెరుగుపరిచేందుకు సిద్ధమైంది. తిరుమల శ్రీవారి దర్శనం కోసం నిత్యం వేలాదిమంది భక్తులు తిరుపతికి వస్తుంటారు. ఈ క్రమంలో తిరుపతిలో మరిన్ని మౌలిక వసుతల్ని కల్పించే దిశగా ప్రణాళిక రూపొందించింది. తిరుపతిలో ప్రస్తుతం ఉన్న మెయిన్ బస్టాండ్ స్థానంలో కొత్తగా ఇంటర్ మోడల్ బస్ టెర్మినల్ నిర్మించాలని నిర్ణయం తీసుకోగా.. తాజాగా దీనికి సంబంధించి కీలక ముందడుగు వేసింది. తిరుపతి ఇంటర్ మోడల్ బస్ టెర్మినల్‌కు ఈపీసీ (ఇంజినీరింగ్, ప్రొక్యూర్ మెంట్, కన్‌స్ట్రక్షన్) విధానంలో నిర్మించాలని తేల్చారు. తిరుపతిలో ప్రస్తుతం ఏపీఎస్ఆర్టీసీకి చెందిన బస్టాండ్ స్థలంలో.. ఎన్‌హెచ్ఎల్ఎంఎల్ (నేషనల్ హైవేస్ లాజిస్టిక్స్ మేనేజ్‌మెంట్ లిమిటెడ్) బస్ టెర్మినల్‌ను రూ.470 కోట్ల అంచనాతో ప్లాన్ చేశారు. ఈ టెర్మినల్ నిర్మాణానికి సంబంధించి మూడు విధానాలను (బీవోటీ, హామ్, ఈపీసీ) అధ్యయనం చేశారు. వాటిలో ఈపీసీ బావుంటుందని ప్రభుత్వానికి ప్రతిపాదనల్ని కూడా పంపారు. తిరుపతి బస్టాండ్ నుంచి రైల్వే స్టేషన్, తిరుమల, ఆ చుట్టుపక్కల ఉన్న ఆలయాలకు వెళ్లే భక్తులకు ఈ టెర్మినల్ కీలకంగా మారింది.. అందుకే దీనికి ఇంటర్ మోడల్‌గా పేరు పెట్టారు. ఇంటర్ మోడల్ బస్ టెర్మినల్ డీపీఆర్ తయారు చేసేందుకు రైట్స్ (రైల్ ఇండియా టెక్నికల్ అండ్ ఎకనమిక్ సర్వీస్ లిమిటెడ్)ను సలహా సంస్థగా నియమించారు.ప్రస్తుతం ఉన్న తిరుపతి బస్టాండ్, డిపో కలిపి మొత్తం 13.18 ఎకరాల్లో ఉంది. ఇందులో 7.11 ఎకరాల్లో ఈ బస్ టెర్మినల్ ప్లాన్ చేశారు. రోడ్డు పక్కన ఉన్న 4.29 ఎకరాలను కమర్షియల్‌గా అభివృద్ధి చేయనున్నారు.99 సెంట్ల భూమిని రోడ్డు కోసం, 79 సెంట్ల భూవిని ఫ్లై ఓవర్ కోసం నిర్మించనున్నారు. బస్ టెర్మినల్‌లో పార్కింగ్ కోసం సెల్లార్‌లో రెండు అంతస్తులు ప్లాన్ చేశారు. ఇలా ఆయ సదుపాయాల కోసం భూమిని కేటాయించారు. ప్రస్తుత ప్లాన్ ప్రకారం గ్రౌండ్ ఫ్లోర్ మొత్తం టెర్మినల్‌కు కేటాయిస్తారు. మొత్తం 98 ప్లాట్‌ఫామ్‌ల నిర్మాణం.. టెర్మినల్ ప్రాంగణంలో మరో 50 బస్సులు నిలిపేందుకు వీలుగా స్థలం కేటాయించనున్నారు.టెర్మినల్ గ్రౌండ్ ఫ్లోర్ పైన 10 అంతస్తులు నిర్మించి కమర్షియల్ (హోటళ్లు, రెస్టారెంట్లు, డార్మెటరీలకు, మిగిలిన షాపులకు) కేటాయిస్తారు. అంతేకాదు టెర్మినల్‌లోని పదో ఫ్లోర్‌లో హెలీప్యాడ్ నిర్మించాలని ప్రతిపాదనలు సిద్ధం చేశారు. ఈ టెర్మినల్ నుంచి బస్టాండ్, రైల్వే స్టేషన్‌ను కనెక్ట్ చేసేందుకు ఫుట్ ఓవర్ బ్రిడ్జి నిర్మించనున్నారు. ఇటీవల అధికారులు ఈ ప్రాజెక్టులో పెట్టుబడి పెట్టేందుకు ఆసక్తిగా ఉన్నవారితో అధికారులు మాట్లాడారు.. వారి నుంచి అభిప్రాయాలసేకరించి పభుత్వానికి నివేదిక పంపించనున్నారు. కమర్షియల్‌గా కేటాయించబోయే వాటితో లాభాల పరిస్థితి.. ఆర్టీసీకి ఎంత ఇస్తారు, ఒప్పందం ఎన్నేళ్లు అనే అంశాలు తెలియాల్సి ఉంది. ప్రస్తుతం ఉన్న బస్టాండ్‌ను మరో చోటికి తరలిస్తే 5 ఎకరాల భూమి, డిపో కోసం మరో ఐదు ఎకరాలు తాత్కాలికంగా కేటాయించాలని ఆర్టీసీ జిల్లా కలెక్టర్‌ను కోరింది.



తిరుమల ఆలయాన్ని ప్రతిబింబించేలా బస్టాండ్ ముఖద్వారం నమూనా

## 'వచ్చే 6 నెలల్లో 10 లక్షల ఎల్పీజీ కనెక్షన్లు ఇవ్వాలి'

-మొదటిపేజీ తరువాయి

పీఎన్జీ కనెక్షన్ తీసుకున్నా దీపం పథకం ద్వారా కలిగే లబ్ధి పొందవచ్చన్న విషయంపై లబ్ధిదారులకు అవగాహన కల్పించాలని సీఎం దిశానిర్దేశం చేశారు. రాష్ట్రంలో గ్యాస్ సరఫరాపై సచివాలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు సమీక్ష నిర్వహించారు. గ్యాస్ సరఫరా ఇబ్బందులను అధిగమించడానికి ఆయిల్ కంపెనీలు పీఎన్జీ కనెక్షన్లను పెంచేందుకు తీసుకుంటున్న చర్యలను సమీక్షించారు. వచ్చే 6 నెలల్లో మొత్తం 10 లక్షల పీఎన్జీ కనెక్షన్లు ఇవ్వాలని, ఈ విషయంలో జాప్యం ఉండకూడదని, టార్గెట్ ఎట్టిపరిస్థితుల్లో చేరుకోవాలని చెప్పారు.

### కేంద్ర మంత్రికి చంద్రబాబు ఫోన్

గృహ అవసరాలకు సంబంధించి గ్యాస్ సరఫరాలో సమస్యలను అధిగమించామని ఈ సందర్భంగా అధికారులు సీఎం చంద్రబాబుకు తెలిపారు. డొమెస్టిక్ పంపిణీకి సంబంధించి సమస్యను తగ్గించామని, త్వరలో సాధారణ స్థితికి తీసుకువస్తామన్నారు. శ్రీకాకుళం – కాకినాడ నేచురల్ గ్యాస్ పైప్ లైన్ పనుల్లో జాప్యంపై సీఎం అధికారుల వివరణ కోరారు. దీనికి సంబంధించి కేంద్రం కొన్ని నిర్ణయాలు తీసుకోవాల్సి ఉందని అధికారులు చెప్పడంతో సమీక్ష నుంచే కేంద్ర పెట్రోలియం, సహజ వాయువు శాఖ మంత్రి హర్దీప్ సింగ్ పూరికి చంద్రబాబు ఫోన్ చేశారు. ఇప్పటికే టెండర్ల ప్రక్రియ పూర్తి అయినందున వెంటనే పనులు పూర్తి చేసేలా చూడాలని కోరారు. దీనికి సానుకూలంగా స్పందించిన కేంద్ర మంత్రి త్వరలోనే సమీక్షించి తగు చర్యలు తీసుకుంటామని తెలిపారు.

### ఎల్పీజీ, పీఎన్జీ మధ్య వ్యత్యాసం

ఎల్పీజీ, పీఎన్జీ సిలిండర్ ధర వ్యత్యాసం చూసుకుంటే గ్యాస్ సిలిండర్ ధర ప్రతినెలా సుమారు రూ.1,000 పైనే ఉంటుంది. పీఎన్జీ బిల్లు ధర రెండు నెలలకు దాదాపు 500–600 కంటే ఎక్కువ రాదు. ఈ రెండింటి మధ్య 50 శాతం తేడా ఉంటుంది. యుద్ధ ప్రభావం వల్ల సిలిండర్ దొరక్క చాలా మంది ఇబ్బందులు పడుతున్నారు. గ్యాస్ బుక్ చేసి వెయిట్ చేయాల్సిన అవసరం లేదని, పైపుల ద్వారానే గ్యాస్ వచ్చేస్తుందని ప్రభుత్వం ఇప్పటికే తెలిపింది. నిరంతరం పైపుల ద్వారానే గ్యాస్ సరఫరా అవుతుందని, మధ్యలో ఆగిపోవడం వంటివి ఉండవు అని వెల్లడించింది. ఎల్?పీజీతో పోల్చుకుంటే పీఎన్జీ కనెక్షన్ అనేది చాలా ప్రయోజనకరమైనదిగా ఉంటుందని ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు. అందులో భాగంగా దీపం పథకం లబ్దిదారులు పీఎన్జీకి మారితే, వారికి దీపం పథకం కింద ఇచ్చే రాయితీ సొమ్మును జమ చేసేందుకు ఇప్పటికే ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. పీఎన్జీ కనెక్షన్ తీసుకున్నా దీపం పథకం ద్వారా కలిగే లబ్ధి పొందవచ్చన్న విషయంపై లబ్ధిదారులకు అవగాహన కల్పించాలని సీఎం చంద్రబాబు తాజాగా అధికారులకు దిశానిర్దేశం చేశారు.

## 'క్రిమినల్‌తో రాజకీయాలు చేసేటప్పుడు చాలా జాగ్రత్తగా ఉండాలి'

-మొదటిపేజీ తరువాయి

పుస్తకాల పంపిణీ, స్వచ్ఛాంధ్ర కార్యక్రమాలకు మంత్రులు ఓనర్ షిప్ తీసుకోవాలని ఆదేశించారు. ప్రతీ మంత్రి పట్టాదారు పాస్ పుస్తకాల పంపిణీకి సంబంధించి 4 కార్యక్రమాల్లోనైనా పాల్గొనాలని సూచించారు. కూటమి ఎమ్మెల్యేలూ ఇదే అనుసరించాలన్నారు. జలధారకు ఉపాధి హామీ నిధులు అనుసంధానం అయ్యేలా పనులు చేపట్టాలని సీఎం దిశానిర్దేశం చేశారు. సూర్యఘర్, పీఎం కుసుమ్ పథకం కింద వీలైనన్ని ఎక్కువ కనెక్షన్లు ఇచ్చేలా కార్యాచరణ ఉండాలన్నారు. గ్రామాలను శుభ్రంగా ఉంచుకుంటూ వ్యాధుల నివారణకు కృషి చేసేలా స్వచ్ఛఆంధ్ర కార్యక్రమాలు చేపట్టాలని ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశించారు.

బెదిరింపు రాజకీయాలను ధీటుగా తిప్పికొట్టాలి

ఈ సందర్భంగా కరుడుగట్టిన నేరస్థుడితో రాజకీయాలు ప్రమాదకరమన్న సీఎం అన్నారు. క్రిమినల్?తో రాజకీయాలు చేసేటప్పుడు చాలా జాగ్రత్తగా ఉండాలని మంత్రులకు సీఎం సూచించారు. ఉన్నది లేనట్టు, లేనిది ఉన్నట్టు ప్రచారం చేసే క్రిమినల్ కుట్రలను మంత్రులు నిత్యం అప్రమత్తంగా ఉంటూ తిప్పికొట్టాలని సూచించారు. ప్రజలకు వాస్తవాలు చెప్తూ వారిని చైతన్య పరచాలన్నారు. బెదిరింపు రాజకీయాలను ధీటుగా తిప్పికొట్టాలని ఆదేశించారు.

కార్యదర్శుల పనితీరుపై చంద్రబాబు అసంతృప్తి

అంతకు ముందు కార్యదర్శుల పనితీరుపై ముఖ్యమంత్రి చంద్రబాబు అసంతృప్తి వ్యక్తం చేశారు. క్యాబినెట్ భేటీ ప్రారంభమైనా, అజెండా తమకు రాలేదని సీఎం వద్ద మంత్రి మనోహర్ ప్రస్తావించారు. అజెండా ముందే వస్తే స్టడీ చేసుకుని క్యాబినెట్‌కు వచ్చే వీలు ఉండేదని అన్నారు. దీనిపై స్పందించిన సీఎం కార్యదర్శుల పనితీరుపై అసంతృప్తి వ్యక్తం చేశారు. వ్యవస్థలు మరింత ఉపసయోగపడాల్సిందిపోయి రాను రానూ మరింత సంక్లిష్టంగా మారుతున్నాయని అధికారుల తీరును చంద్రబాబు తప్పుబట్టారు.

డీమ్డ్ యూనివర్సిటీలను ఎక్కువ ప్రొమోట్ చేయాలి

గతంలో కార్యదర్శులు సబ్జెక్టుల్లో భాగస్వాములవుతూ చర్చల్లో ఏ సందేహం వచ్చినా పూర్తిగా నివృత్తి చేసేందుకు చొరవ చూపేవారన్నారు. ఇప్పుడా పరిస్థితి లేదని సీఎం చంద్రబాబు అసంతృప్తి వ్యక్తం చేశారు. డీమ్డ్ యూనివర్సిటీలను రాష్ట్రంలో ఎక్కువ ప్రొమోట్ చేయాలని సీఎం ఆదేశించారు. 10 ఎకరాలకు తక్కువ కాకుండా నిబంధనలు పెట్టి నాణ్యత పెంచుతూ, ఎక్కువ డీమ్డ్ యూనివర్సిటీలు అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు. ఇతర రాష్ట్రాలతో పోల్చితే ఏపీలో తక్కువ డీమ్డ్ యూనివర్సిటీలు ఉన్నాయని అన్నారు.

## పవర్ ఫుల్ ఉమెన్ నుంచి జైలు గోడలవరకు... కళింగిరి శాంతి ప్రస్థానం

**కాకినాడ :** దేవాదాయ శాఖలో అత్యంత వివాదాస్పద అధికారిగా పేరుపొందిన అసిస్టెంట్ కమిషనర్ కళింగరి శాంతి ఉదంతం, అధికార బలం ఉంటే వ్యవస్థలను ఎలా శాసించవచ్చో చెప్పడానికి ఒక ఉదాహరణగా నిలుస్తుంది. కేవలం ఆరేళ్ల సర్వీసులో, అందులోనూ రెండేళ్ల సస్పెన్షన్ కాలం పోను, కేవలం నాలుగేళ్లలోనే ఆమె సృష్టించిన ప్రకంపనలు అన్నీ ఇన్నీ కావు. తాజాగా ఏసీబీ దాడుల్లో ఆదాయానికి మించిన ఆస్తుల కేసులో అరెస్ట్ అయ్యి, 14 రోజుల రిమాండ్‌కు వెళ్లడంతో ఆమె అప్రతిహత ప్రస్థానానికి తాత్కాలికంగా బ్రేక్ పడింది.2020లో దేవాదాయ శాఖలో అసిస్టెంట్ కమిషనర్‌గా చేరిన కళింగరి శాంతికి, అప్పటి అధికార పార్టీలో కీలక నేతగా ఉన్న విజయసాయి రెడ్డితో పరిచయం ఏర్పడింది. ఆ రాజకీయ అండతో ఆమె అటు ఉద్యోగ పరంగా, ఇటు వ్యక్తిగత జీవితంలోనూ తీవ్ర వివాదాలకు కేంద్రబిందువైంది. భర్త మదన్ మోహన్‌తో విడాకులు తీసుకోకుండానే మరొకరితో సహజీవనం చేయడం, ఒక బిడ్డకు జన్మనివ్వడం వంటి అంశాలు అప్పట్లో పెద్ద ఎత్తున చర్చకు దారితీశాయి. ఆ బిడ్డ తండ్రి ఎవరనే విషయంలో భర్త మదన్ మోహన్ చేసిన ఆరోపణలు, విజయసాయి రెడ్డికి డీఎన్ఏ పరీక్షలు చేయాలన్న డిమాండ్లు అప్పట్లో సంచలనం సృష్టించాయి.శాంతి అధికార దర్పం ఏ స్థాయిలో ఉండేదంటే, విశాఖపట్నంలో పనిచేస్తున్న సమయంలో తన పై అధికారి అయిన డెప్యూటీ కమిషనర్ పుష్పవర్ధన్ గదిలోకి చొరబడి ఆయనపై ఇసుక చల్లడం ఆమె బరితెగింపునకు పరాకాష్ట. ఒక అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్‌ను సస్పెండ్ చేసినందుకు నిరసనగా ఆమె ఈ చర్యకు పాల్పడటం గమనార్హం.ఈ ఘటన సీసీటీవీలో రికార్డ్ అయినప్పటికీ, విచారణాధికారి తప్పు పట్టినప్పటికీ, ప్రభుత్వం ఆమెపై చర్యలు తీసుకోకుండా, ఫిర్యాదు చేసిన పై అధికారిని బదిలీ చేయడం వ్యవస్థల నిర్వీర్యానికి నిదర్శనం. దీంతో మనస్తాపం చెందిన డెప్యూటీ కమిషనర్ తన పదవికి రాజీనామా చేయాల్సి వచ్చింది.విశాఖలో పని చేస్తున్న సమయంలో 'ప్రేమ సమాజం' భూములు, ఇతర దేవాదాయ భూముల లీజుల వ్యవహారంలో ఆమెపై అనేక అవినీతి ఆరోపణలు వచ్చాయి. 2024 జూన్‌లో కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత ఆమెను సస్పెండ్ చేసినప్పటికీ, రాజకీయ ఒత్తిళ్ల వల్ల ఆమెను డిస్మిస్ చేసే ఫైల్ ముందుకు కదలలేదనే విమర్శలు ఉన్నాయి. కోర్టు ఆదేశాలతో మార్చి చివరి వారంలో తిరిగి పోస్టింగ్ పొందిన శాంతి, పది రోజులు గడవకముందే ఏసీబీ వలలో చిక్కుకుంది. ఆదాయానికి మించి ఆస్తులు కూడబెట్టారనే అభియోగంపై ఏసీబీ ఆమెను అరెస్ట్ చేసి జైలుకు పంపింది.శాంతి ఉదంతం రెండు ముఖ్యమైన పాఠాలను నేర్పుతుంది. రాజకీయ నాయకుల మద్దతు ఉంటే చట్టాన్ని, నిబంధనలను అతిక్రమించవచ్చనే ధీమా అధికారులను ఎంతటి పతనానికి తీసుకెళ్తుందో శాంతి జీవితం ఒక హెచ్చరిక. ఒక జూనియర్ అధికారి ఇంతగా రెచ్చిపోతున్నా.. గత ప్రభుత్వం, ప్రస్తుత ప్రభుత్వం ఆమె విషయంలో నిర్ణయాత్మక చర్యలు తీసుకోవడంలో విఫలమయ్యాయి. కోర్టు ఆదేశాలు ఇచ్చే వరకు లేదా ఏసీబీ దాడులు జరిగే వరకు వేచి చూడటం వ్యవస్థల బలహీనతను సూచిస్తుంది.

## కర్తవ్యం కరెక్ట గా చేసిన ఆఫీసర్స్ కు అభినందనలు.

.....సీఎం పర్యటనలో సహకరించిన అధికారులకు సన్మానం

యాడికి ఏప్రిల్ 10 సీమ వార్త



యాడికిలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు జలధార కార్యక్రమముకు విచ్చేసిన సమయంలో ఎంతగానో సహ కరించిన అధికారులు యాడికి ఎమ్మార్వో ప్రతాపరెడ్డి యాడికి సిఐ శ్రీనివాసులు యాడికి ఎంపీడీవో వీర్రాజు విద్యుత్ ఏఈ విజయుడు వీరు బాధ్యత పూర్వకముగా విధులు నిర్వహించినందుకు తెలుగుదేశం పార్టీ నాయకులు సన్మానించడం జరిగినది. ఈ కార్యక్రమంలో పాల్గొన్న వారు గొర్తి రుద్రమ నాయుడు వేలూరు రంగయ్య పరిమి చరణ్ నాగ మోహన్ రెడ్డి వెలిగండ్ల ఆదినారాయణ తిరుపురం నీలకంఠ తదితరులు కూటమి నాయకులు కార్యకర్తలు అందరూ పాల్గొన్నారు

## కండక్టర్ ది "బంగారం" లాంటి మనసు.

.....పోగొట్టుకున్న బంగారాన్ని ప్రయాణికురాలుకి ఇచ్చిన కండక్టర్.

... సోమందేపల్లి ఎస్సై సుధాకర్ యాదవ్ చొరవతో ప్రయాణికురాలికి అప్పగింత.




సోమందేపల్లి ఏప్రిల్ 10 సీమ వార్త.

సోమందేపల్లి మండలానికి చెందిన కృష్ణబాయి బెంగళూరు నుండి సోమందేపల్లి కు సీపీసీ బస్సులో ప్రయాణిస్తుండగా, తన పర్సును అనుకోకుండా పోగొట్టుకున్నారు. అదే బస్సులో హిందూపురం నుండి పెనుకొండకు ప్రయాణిస్తున్న నూర్ మహ్మద్ 1,90 వేల విలువచేసే 13 గ్రాముల బంగారాన్ని పోగొట్టుకున్న ప్రయాణికురాలికి అందజేసి నిజాయితీని ప్రదర్శించారు. అలాగే నగదు రూ.2,000/- ఉన్నాయి. నూర్ మహ్మద్ గారు వెంటనే బస్సు డ్రైవర్ అహద్ఖాన్ కి తన ఫోన్ నంబర్ ఇచ్చి, పర్సు గురించి సమాచారం అందించారు. శుక్రవారం కృష్ణబాయి సోమందేపల్లి పోలీస్ స్టేషన్‌ను సంప్రదించగా, ఎస్.ఐ శ్రీ జి. సుధాకర్ యాదవ్ గారు బస్సు డ్రైవర్ ద్వారా నూర్ మహ్మద్‌ను సంప్రదించారు. వెంటనే నూర్ మహ్మద్ గారు సోమందేపల్లి పోలీస్ స్టేషన్‌కు వచ్చి, పర్సులో ఉన్న అన్ని వస్తువులను యథావిధిగా కృష్ణబాయి గారికి అప్పగించారు. నూర్ మహ్మద్ నిజాయితీని మెచ్చుకున్న ఎస్.ఐ శ్రీ జి. సుధాకర్ యాదవ్ , ఆయనను దుశ్శాలువ మరియు ఫలహారంతో సత్కరించారు. ఈ సందర్భంగా ఎస్.ఐ మాట్లాడుతూ, "సమాజంలో ఇలాంటి నిజాయితీ ఉన్న వ్యక్తులు ఉండటం చాలా గర్వకారణం. నూర్ మహ్మద్ గారి చర్యలు ఇతరులకు ఆదర్శంగా నిలుస్తాయి" అని పేర్కొన్నారు.

## నవ్యాంధ్రలో...ఇవాళ కార్పొరేషన్ ను ఏర్పాటు చేయండి.

.... మంత్రి నారా లోకేష్ ను కోరిన... దివంగం పాపన్న.

బెంగళూరు ఏప్రిల్ 10 సిమ వార్త.



బెంగళూరు హెచ్ఐఎల్ ఎయిర్పోర్టులో విద్య ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్ గారిని ఆంధ్ర ప్రదేశ్ దేవాంగ అభ్యుదయ సంఘం రాష్ట్ర వెల్ఫేర్ కోఆర్డినేటర్ దేవాంగం పాపన్న కలిసి దేవంగ కార్పొరేషన్ ఆవశ్యకతను గురించి వివరించడం జరిగింది దేవంగ కార్పొరేషన్ ఏర్పాటు చేసి దేవాంగల అభివృద్ధి కోసం కృషి చేయాలని కోరడం జరిగింది మంత్రి వెంటనే స్పందిస్తూ దేవాంగ కార్పొరేషన్ ఏర్పాటు చేస్తామని దేవాంగలను ఆదుకుంటామని హామీ ఇవ్వడం జరిగింది

## సిరివరంలో పోషణ పక్వాడ కార్యక్రమం

----పౌష్టికాహారం ప్రాముఖ్యత పై అవగాహన



లేపాక్షి సీమ వార్త ఏప్రిల్ 10 :

లేపాక్షి మండలంలోని సిరివరం గ్రామంలో శుక్రవారం 8వ పోషణ పక్వాడ కార్యక్రమాన్ని ఐసిడిఎస్ ఆధ్వర్యం లో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా అంగన్వాడి సూపర్వైజర్ శ్రీలక్ష్మి, జడ్పిటిసి కిష్టప్ప, ఆవుల రెడ్డి, రఘు హాజరయ్యారు. సందర్భంగా సూపర్వైజర్ శ్రీలక్ష్మి మాట్లాడుతూ గర్భవతులు, బాలిం తలు, చిన్నారులకు పౌష్టికాహారం యొక్క ప్రాముఖ్యతను వివరించారు. ఆరోగ్యవంతమైన సమాజం కోసం వారు పౌష్టికాహారం తీసుకోవడాన్ని అలవర్చుకోవాలని, తల్లి బిడ్డ ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. అంగన్వాడి కేంద్రాల ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన పౌష్టికాహార స్టాల్స్ ప్రదర్శన అతిథులను ఆకట్టుకుంది. తృణ ధాన్యాలు, ఆకు కూరలు, పండ్లు వినియోగంపై అవగాహన కల్పించారు. అనంతరం ఆరోగ్యవంతమైన భారతదేశం కోసం అందరూ కలిసి కలిసికట్టుగా కృషి చేస్తామని ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి సాయి ప్రసాద్, మహిళా పోలీస్ శిరీష, అంగన్వాడి కార్య కర్తలు, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్న వారిలో ఉన్నారు.

# ఘనంగా ఆంధ్రప్రదేశ్ చేనేత కార్మిక సంఘం 90 వ వార్షికోత్సవం

సోమందేపల్లి ఏప్రిల్ 10 సీమ వార్త

మండల కేంద్రంలో చేనేతకార్మికులు కలిసి ఆంధ్రప్రదేశ్ చేనేత కార్మిక సంఘం 90 వ వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. చేనేత పతాకాన్ని చేనేత కార్మికులు మామిళ్ళ శ్రీనివాసులు, బోయ పూజారి నరసింహులు పతాకా విష్కరణ గావించారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ చేనేత కార్మిక సంఘం జిల్లా కమిటీ సభ్యులు శీలా నారాయణస్వామి మాట్లాడుతూ చేనేత పరిశ్రమ రక్షణకై చేనేత కార్మికుల శ్రేయస్సుకై సమరశీల పోరాటాలకు సిద్ధం కావలసిన సమయం ఆసన్నమైందని ఆంధ్రప్రదేశ్ చేనేత కార్మిక సంఘం 90 వ వార్షికోత్సవం సందర్భంగా పిలుపునిచ్చారు.

భారతదేశంలో వ్యవసాయం తరువాత రెండవ అతిపెద్ద పరిశ్రమ చేనేత పరిశ్రమని మనందరికీ తెలిసిన విషయమే.. అయితే చేనేత పరిశ్రమ, చేనేత కళ 27 వేల సంవత్సరాల క్రితం హరప్పా,మొహం జదరో కాలంలో ఆనాటి చారిత్రక త్రవ్వకాలలో బయటపడిందని 1936 ఏప్రిల్ 10 న తూర్పు గోదావరి జిల్లా ఉప్పాడ లో చేనేత సంఘం ఏర్పరచి ప్రధాన కార్యదర్శిగా పుత్సల సత్యనారాయణ సహాయ కార్యదర్శిగా కడుపు రాములను ఎన్నుకొని కార్మికుల పక్షాన అనేక పోరాటాలు నిర్వహించారని ఈ తరుణంలో రాష్ట్రంలో ని రాయలసీమలో కూడా చేనేత కార్మికులు ముందుకు వచ్చి కర్నూలు జిల్లా నంద్యాలలో 1937 లో రెండవ రాష్ట్ర మహాసభను నిర్వహించారని తెలిపారు. ఈ మహాసభలో మెట్ల వీరయ్య, అధ్యక్షుడిగా పుత్సల సత్యనారాయణ ప్రధాన కార్యదర్శిగా కమిటీ సభ్యులుగా కొంతమందిని ఎన్నుకున్నారని పేర్కొన్నారు. చేనేతలకు 22 రకాల రిజర్వేషన్ యాక్ట్ తీసుకురావడం లోను సంఘం ముందు పీటన నిలబడి పనిచేసిందని ఇప్పటికైనా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు చేనేత పరిశ్రమ రక్షణకు పూనుకోవాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. బ్రిటిష్ కాలంలో చేనేతపై పన్ను లేదని స్వాతంత్రం వచ్చిన తర్వాత మన రాజ్యాంగంలో ఆర్టికల్ 43లో గ్రామీణ కుటీర పరిశ్రమలు జాబితాలో చేనేతను చేర్చి చేనేత పైన పన్ను లేకుండా రాజ్యాంగంలో రాయబడి ఉంటే నేటి కేంద్ర ప్రభుత్వాలు చేనేతపైన వివిధ రకాల పన్నులు నూలు రంగులు పట్టు వస్త్రం పైన జిఎస్టి పేరుతో పన్నులు వేసి చేనేత పరిశ్రమను తీవ్రమైన సంక్షోభంలో ఒక నెట్టబడుతున్న సమయంలో చేనేత కార్మికులు న్యాయమైన పలు డిమాండ్లను కోరుతున్నారు. ఈ డిమాండ్ల సాధనకై పోరాటానికి సమర్థం కావాల్సిన అవసరం ఎంతైనా ఉన్నదన్నారు. చేనేత పైన జీఎస్టీని తక్షణమే ఎత్తివేయాలని, చేనేత రిజర్వేషన్ యాక్ట్ ను 1985-1995 కఠినంగా అమలు చేయాలని,సహకార సంఘాలకు తక్షణమే ఎన్నికలు నిర్వహించాలని, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు తమ బడ్జెట్లో కేంద్ర ప్రభుత్వం 25వేల కోట్లు రాష్ట్ర ప్రభుత్వం 2 వేల కోట్లు కేటాయించి చేనేత పరిశ్రమను ఆదుకోవాలని, రాష్ట్ర అధి నాయకత్వం 2025 రాష్ట్ర 7వ తేదీన ప్రకటించిన మేరకు ప్రతి సంవత్సరం 25 వేల ఆర్థిక సహాయం అర్హత కలిగిన ప్రతి కార్మికులకు అందించాలని, ఆకలి చావులు ఆత్మహత్యలకు గురైన చేనేత కార్మికుల కుటుంబాలకు 10 లక్షల రూపాయల ఎక్స్ గ్రేషియా ఇవ్వాలని, కుటుంబంలో అర్హులైన వారందరికీ చేనేత పెన్షన్ అందించాలని, జౌళి శాఖలో అంతర్భాంగా ఉన్న చేనేతను విడగొట్టి చేనేత మంత్రిత్వ శాఖను ఏర్పాటు చేయాలని, స్కూల్ పిల్లలకు చేనేత వస్త్రాలనే కొనుగోలు చేసి అందించాలని, నేతన్నలకు 3 సెంట్ల భూమి ఇచ్చి ప్రభుత్వమే ఇల్లు కట్టించి ఇవ్వాలని, చేనేతకు 200 యూనిట్లు ఉచిత విద్యుత్తును సొంత ఇల్లు సొంతమగ్గంతో పాటు అద్దె ఇళ్లల్లోనూ అద్దె మగ్గాల



షెడ్లలో నేసే వారికి కూడా వర్తింప చేయాలని , నేతన్న భరోసా పథకాన్ని మగ్గం ఉన్న చేనేత కార్మికులతో పాటు మగ్గాల షెడ్లు లో ఉప వృత్తులు వారికి కూడా వర్తింప చేయాలని, తదితర డిమాండ్ల సాధనకై చేనేత కార్మికులు చేనేత శ్రేయోభిలాషులు ఐక్యంగా సమస్యల పోరాటాలకు సంసిద్ధం కావాలన్నారు. ప్రభుత్వాల చేనేత పరిశ్రమను కాపాడుకోవాలని చేనేత కలను కాపాడుకుంటామని ఆంధ్రప్రదేశ్ చేనేత కార్మిక సంఘం 90వ వార్షికోత్సవం సందర్భంగా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ చేనేత కార్మిక సంఘం మండల కమిటీ సభ్యులు దాసరి సుధాకర్, మణుతూరి ఈశ్వర్, బెస్త కిష్టప్ప, దేవాంగ వెంకటేశులు, ఈడిగ నాగరాజు, బెస్త వెంకటేశులు, పెదరాయుడు, న్యామద్దల రామకృష్ణ, బోయ నాగరాజు, రమేష్, వడ్డే వెంకటేశులు చేనేత కార్మికులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# సంస్కృతి కళాశాలలో 5 రోజుల ఐడిఈ బూట్ క్యాంప్ విజయవంతం





పుట్టపర్తి ఏప్రిల్10 (సీమవార్త బ్యూరో) :-

విద్యార్థుల్లో ఆవిష్కరణాత్మక ఆలోచనలు, వ్యాపార దృక్పథం మరియు స్టార్టప్ సంస్కృతిని పెంపొందించడమే లక్ష్యంగా పుట్టపర్తి సాంస్కృతి గ్రూప్ ఆఫ్ ఇన్స్టిట్యూషన్స్ లో 5 రోజులు ఐడిఈ బూట్ క్యాంప్ విజయవంతంగా ముగిసిందని యాజమాన్యం తెలిపింది. శుక్రవారం ముగింపు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా అనంతపురం శ్రీకృష్ణదేవరాయ యూనివర్సిటీ ప్రొఫెసర్. ఎన్.వి.ఆర్.జ్యోతి కుమార్ ( ఎస్కేయూ వైస్-చాన్సలర్) హాజరై విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థులు ఉద్యోగాల కోసం ఎదురు చూడకుండా, స్వయం ఉపాధి దిశగా ముందడుగు వేయాలని, ఉద్యోగాలను కల్పించే స్థాయికి ఎదగాలని సూచించారు. అనంతరం అభిషేక్ రంజన్ విద్యాశాఖ ఇన్నోవేషన్ సెల్ (ఎం ఐ సి) ఇన్నోవేషన్ ఆఫీసర్ మాట్లాడుతూ, ఏఐసిటిఈ ద్వారా విద్యార్థులు మరియు అధ్యాపకుల కోసం అనేక ఆవిష్కరణ అవకాశాలు సృష్టించబడ్డాయని తెలిపారు. ఈ అవకాశాలను సమర్థంగా వినియోగించుకోవాలని ఆయన





ప్రోత్సహించారు. ఈ బూట్ క్యాంప్‌లో మొత్తం 72 బృందాలు పాల్గొన్నాయని, వీటిలో ఉత్తమ ఆలోచనల ప్రదర్శన కింద 5 బృందాలు విజేతలుగా నిలిచాయన్నారు. క్యాషియో-హస్ -- ఆదిత్య ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ, శ్రీకాకుళం,

వాష్ ట్రాకర్ -- నరసరావుపేట ఇంజినీరింగ్ కాలేజ్, నరసరావుపేట, వెల్నెస్ వారియర్స్ -- రాఘవేంద్ర ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫార్మాస్యూటికల్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్ (రెఫర్), అనంతపురం, శక్తి -- ఎస్.ఆర్.ఐ.టి, అనంతపురం, గ్రౌండ్ నెట్ సీల్ -- సంస్కృతి గ్రూప్ ఆఫ్ ఇన్స్టిట్యూషన్స్, పుట్టపర్తి ఈ 5 రోజుల శిక్షణా శిబిరం ద్వారా పాల్గొన్న విద్యార్థులు వ్యాపార ఆలోచనలను రూపుదిద్దుకోవడం, ప్రదర్శించడం, అమలు చేయడానికి అవసరమైన నైపుణ్యాలను అభివృద్ధి చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల యాజమాన్యం, ఉపాధ్యాయులు, విద్యార్థులతో పాటు, వివిధ రాష్ట్రాల కళాశాలల నుంచి వచ్చిన విద్యార్థులు, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

# పుట్టపర్తిలో ఘనంగా జాతీయ సర్వే దినోత్సవం

- ముఖ్యఅతిథిగా పాల్గొన్న జాయింట్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్
- రక్తదాన శిబిరం ఏర్పాటు చేసిన సర్వేయర్లు
- రక్తదానం చేసిన జాయింట్ కలెక్టర్..

పుట్టపర్తి ఏప్రిల్10 (సీమవార్త బ్యూరో) :-

"జాతీయ సర్వే దినోత్సవాన్ని పురస్కరించుకొని సత్యసాయి జిల్లా సర్వే సెటిల్మెంట్ అండ్ ల్యాండ్ రికార్డ్స్ డిపార్ట్మెంట్ ఆధ్వర్యంలో సర్వేయర్లు రక్తదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జిల్లా సంయుక్త కలెక్టర్ మంత్రి మౌర్య భరద్వాజ్ మరియు జిల్లా సర్వే మరియు భూరికార్డుల అధికారి కుమారి విజయశాంతి భాయి హాజరయ్యారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్ రక్తదానం చేసి జిల్లాలోని సర్వేయర్లందరినీ ప్రోత్సహించారు. ఈ శిబిరంలో పాల్గొన్న ప్రతి సర్వేయర్ రక్తదానం చేయడం జరిగింది. అదేవిధంగా గత వారం క్రితం జరిగిన సర్వేయర్ల క్రీడా పోటీల్లో గెలుపొందిన విజేతలకు జాయింట్ కలెక్టర్ చేతుల మీదుగా బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లాలోని సర్వే డిపార్ట్మెంట్ ఉద్యోగులందరూ, ఐఓఎస్, డిఐఓఎస్, మండల సర్వేయర్లు, విలేజ్ సర్వేయర్లు, తదితరులు పాల్గొన్నారు.





Printed, Pulished, Owned by BEEREA ESWARAYYA & Printed at M/S ESWAR Offset Printers D.No. 1-1756, Chowdeswary Colony, Gorantla, Sri Sathya Sai (Dt)A.P.
RNI No: APTEL /25/A2860 & Published at D.No. 1-1756, Chowdeswary Colony, Gorantla, Sri Sathya Sai (Dt)A.P. Editor B. ESWARAYYA Cell :9490860881